క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ఈకార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

13న కాలం చెల్లిన వాహనాల వేలం

పరవాడ: అనకాపల్లి జిల్లా పోలీసు విభాగానికి చెందిన కాలం చెల్లిన పోలీస్ వాహనాలను ఈ నెల 13న ఆన్‌లైన్ ద్వారా వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల 89 కాలం చెల్లిన పోలీసు వాహనాలను 15 లాట్లుగా విభజించి ఈ నెల 13న ఆన్‌లైన్ ద్వారా వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు వెబ్‌సైట్‌లో బిడ్డింగ్ వేయాలని సూచించారు. వేలం వేయనున్న కాలం చెల్లిన వాహనాలు విశాఖపట్నం బక్కన్నపాలెంలో ఉన్నాయని ఆసక్తి గల వారు వెళ్లి చూసుకోవచ్చునని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనున్న వారు https://www.konugolu.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సీఐ ఈశ్వర్రావు కోరారు.

విశేషంగా తిరువీధి



అమ్మవార్లు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం సింహవల్లీతాయారు, సువర్ణ అమ్మవార్ల తిరువీధి విశేషంగా జరిగింది. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠంపజేసి తిరువీధి నిర్వహించారు. షోడషోపచార పూజలు నిర్వహించి హారతులు అందజేశారు.

వ్యక్తి అదృశ్యం



పవన్‌కుమార్

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామానికి చెందిన పెదపాటి పవన్‌కుమార్(32) ఈ నెల 4 తేదీ నుంచి కనిపించడం లేదని అతని తండ్రి పెదపాటి మాణిక్యం శుక్రవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు కొంతకాలంగా మానసిక ఆరోగ్యంతో బాధపడుతున్నాడని పేర్కొన్నాడు. కుమారుడి ఆచూకీ కోసం పరిసర గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసును ఏఎస్ఐ వర్మ దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పరవాడ: తానాం గ్రామ సమీపంలోని జీడి మామిడి తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పరవాడ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సురేష్ అందించిన వివరాలు... తానాం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1300 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సబ్బవరం: మండలంలోని బాటజంగాలపాలెంలో చింత చెట్టుపై నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కాపుశెట్టి సూరిబాబు(45) ఈ నెల 5వ తేదీన కల్లం వద్ద ఉన్న చింత చెట్టు ఎక్కి చింతబొట్టలు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి.దీంతో కుటుంబ సభ్యులు అనకాపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి పైడిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు.

14న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

13,600 మంది గుర్తింపు



అధికారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ నెల 14న నిర్వహించే నులిపురుగుల (ఆల్బెండజోల్)నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత్రల పంపిణీని పర్యవేక్షించడానికి మండల స్థాయి అధికారులను నియమించినట్లు చెప్పారు. మాత్రలు వేసుకోవడానికి సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలో 9,600 మంది, గుల్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలో 4,000 మంది విద్యార్థులను గుర్తించామన్నారు. వీరికి మాత్రలు వేసేందుకు 400 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా అనారోగ్యం కారణంగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోని విద్యార్థులకు ఈ నెల 18న మరలా అందివ్వడం జరుగుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో మాత్రలు వికటించి ఇబ్బందులు పడే విద్యార్థులకు సేవలందించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సిబ్బంది అంతా అప్రమత్తంగా వ్యవహరించి నులుపురుగు నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, ఎంఈవో ఎస్. అప్పలరాజు, ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, సూపర్ వైజర్ స్వర్ణలత, వెలుగు ఏపీఎం సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం



బహుమతులు అందుకున్న వారితో ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, అధికారులు

పరవాడ: భద్రత ప్రమాణాల నిర్వహణలో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ భద్రత పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన 52వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో భద్రత, ఆరోగ్యం, పర్యావరణ సమస్యలపై యాజమాన్యం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ ప్రమాద రహిత వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఉద్యోగులు, కార్మికులు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించే విధంగా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఉద్యోగులు, కార్మికులకు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రమాదాల నివారణపై పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు ఉద్యోగులకు వ్యాస రచన , స్కిట్, సేఫ్టీ తదితర పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన విజేతలకు జీజీఎం సిన్హా బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు భద్రత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఓ అండ్ ఎం జీఎం డి.పి పాత్రో, భద్రత డీజీఎం, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు బంగారు గొలుసు వితరణ



బంగారు గొలుసును ఏఈవోకు అందజేస్తున్న దాత గౌరీశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నగరంలోని తాటిచెట్లపాలేనికి చెందిన మళ్ల గౌరీ శంకర్ అనేదాత సుమారు 42.730గ్రాముల బంగారం గొలుసు కానుకగా ఇచ్చారు. ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన దాత గొలుసును ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, సిబ్బంది సాంబ, నాయుడు పాల్గొన్నారు.

సీతంరాజును భారీ మెజార్టీతో గెలిపించాలి



సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను కోరుతున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నవోదయ కళాశాలలో జరిగిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పట్టభద్రులకు భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి , అదీప్‌రాజ్ విజ్ఞప్తి

సింహాచలం: ఈనెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారిద్దరూ పలు ప్రాంతాల్లో వేర్వేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బాలాజీనగర్‌లోని ప్రైవేటు కల్యాణ మండపంలో పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో ముత్తంశెట్టి మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు కానుగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులంతా సీతంరాజు సుధాకర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. నవోదయ జూనియర్ కళాశాల ఆవరణలో పెందుర్తి మండలం, జీవీఎంసీ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు సక్క కనకరాజు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కె.దేవి సాంబ, 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, నాయకుడు గొర్లె రామునాయుడు పాల్గొన్నారు. అలాగే పెందుర్తి మండలం రాంపురం గ్రామంలోని పట్టభద్రులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు.

- 98వవార్డు అడవివరంలో వైఎస్సార్‌సీపీనాయకులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.
- 93వవార్డు పరిధిలోని దుర్గానగర్, సాయి దుర్గానగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దాసరి రాజు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

పరవాడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మండలంలో తానాం, గొర్లివానిపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తానాంలో జెడ్పీటీసీ పి.ఎస్.రాజు పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

- గొర్లివానిపాలెంలో గొర్లి గోపి అమ్మలు , దేశపాత్రునిపాలెంలో 79 వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అప్పికొండ మహలక్ష్మినాయుడు, నాయుడుపాలెం గ్రామంలో పార్టీ నాయకులు కూండ్రపు సీతారామయ్య తదితరులు వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మద్దతుగా ప్రచారం చేశారు.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక,బంగారమ్మపాలెం,సబ్బవరం,సాయినగర్ కాలనీ,గొర్లివానిపాలెంలోని గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేపట్టారు.

ఉపాధ్యాయులు,సచివాలయ సిబ్బందిని కలిసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము,మండల పార్టీ కన్వీనర్ కర్రి బాబు,సబ్బవరం జేసీఎస్ ఇన్‌చార్జి సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,శరగడం రాము, మాజీ ఎంపీపీ గొర్లి ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తానాంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జెడ్పీటీసీ పి.ఎస్.రాజు



గొర్లివానిపాలెం సచివాలయం వద్ద సీతంరాజుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు



పరవాడలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావుచ నాయకులు

సీతంరాజుకే మా మద్దతు : ఏపీ టీచర్స్ యూనియన్

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.దేముడు, జి.దత్తాత్రేయశర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, నిరుద్యోగ సమస్యలను ఎమ్మెల్సీగా గెలిస్తే సీతంరాజు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఈ విషయాన్ని గుర్తించి ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వంలో చలనం రాకపోవడం దురదృష్టకరం



757వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం : ఉక్కు ఉద్యమాన్ని 750 రోజులకు పైగా నిరవధికంగా కొనసాగిస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడం దురదృష్టకరమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 757వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని, కార్మికుల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలే దేశానికి ఆయువుపట్టని, అటువంటి సంస్థలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఆరా



ట్యాబ్స్ వినియోగిస్తున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న రమేష్ నాయుడు

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో రమేష్ నాయుడు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో బోధనకు సంబంధించి అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. 6,7,8వ తరగతుల్లో అభ్యాసనాభివృద్ధి కార్యక్రమం అమలు ,బైజూస్ ట్యాబ్స్ వినియోగిస్తున్న విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 3,4,5వ తరగతుల విద్యార్థులకు తరల్ కార్యక్రమం ద్వారా బోధిస్తున్న తీరును పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో రక్తహీనత గల బాలికలను గుర్తించి వారికి పాఠశాల హెల్త్ అంబాసిడర్ల ద్వారా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం దగ్గరుండి విద్యార్థులకు తినిపించాలని, రెగ్యులర్‌గా ఐరన్ మాత్రలు వారికి వేయించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఆయన వెంట ఎంఈవో ఎస్. అప్పలరాజు, ప్రధానోపాధ్యాయుడు ఆర్‌పీ జగదీష్ తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



ప్రసాద్ మృతదేహం

కూర్మన్నపాలెం: అగనంపూడి తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్(21) ఉరివేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ముద్దు ప్రసాద్ డిగ్రీ చదువుతున్నాడు. మృతుడి తండ్రి కనక అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల కిందట ప్రసాద్‌కు కాలేయానికి సంబంధించిన శస్త్ర జరిగింది. ఈ ఏడాది జనవరిలో అప్పారావుకు హార్ట్ ఆపరేషన్ అయింది. తండ్రి కూడా అనారోగ్యానికి గురవ్వడంతో ప్రసాద్ సరిగ్గా తిండి తినక, మందులు వాడకపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ప్రసాద్ తరచూ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వడ్లపూడిలోని ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఇది ఇలా ఉండగా గురువారం రాత్రి తండ్రి అప్పారావు నరవలోని ఓ పెళ్లికి హాజరవ్వగా, మృతుడి తల్లి, చెల్లి ఎస్.కోటలోని మరో పెళ్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రసాద్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓఎన్‌జీసీ విశ్రాంత ఉద్యోగికి డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న లక్ష్మణరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి బయ్యే లక్ష్మణరావుకు డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యుడు డి.సూర్య ప్రకాశరావు పర్యవేక్షణలో 'విమెన్ అగ్రికల్చరల్ లేబర్-పాలసీపర్‌స్పెక్టివ్స్-ఏ సోషియో లీగల్ స్టడీ ఇన్ సెలక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను లక్ష్మణరావు స్వీకరించారు. ఓఎన్‌జీసీలో జనరల్ మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన లక్ష్మణరావు ఉన్నత విద్యపై ఆసక్తితో డాక్టరేట్ పూర్తి చేశారు.

డీఈవో సందర్శన



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీఈవో చంద్రకళ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టాబ్స్ వినియోగం, జగనన్న విద్య కానుక కిట్స్ నిర్వహణ, నోట్‌బుక్స్ కరక్షన్, పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న తీరు, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు డీఈవో స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అప్పలనాయుడు, ఏఎల్ఎస్‌సీవో వి.శైలజ, ప్రధానోపాధ్యాయిని కె.సలోమి, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపార అవకాశాలు

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్, ఏయూ ఐపీఆర్ చైర్, ఏపీ చాంబర్స్, టీం ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సంయుక్తంగా 'ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్'పై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను వీసీ ప్రారంభించి, మాట్లాడారు. ఫుడ్ ప్రొడక్షన్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. డీఎఫ్ఆర్ఎల్, ఏపీ ఫుడ్ సొసైటీతో సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. నూతన ఆలోచనలతో వచ్చే యువతకు ఆర్థిక సహకారం అందించడానికి అనేక మంది పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆహార ఉత్పత్తి రంగానికి డిమాండ్ పెరుగుతూ వస్తోందన్నారు. ఏయూలో నూతనంగా ఫుడ్ టెక్నాలజీలో ఐదేళ్ల కోర్సును ప్రారంభించడంతో పాటు ఎమ్మెస్సీ సీట్లను పెంచామన్నారు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆహార కొరత లేకుండా వృథాను నియంత్రిస్తూ, వ్యవసాయ రంగానికి లాభదాయకంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కావాలన్నారు. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో పనిచేసే వారికి వైవిధ్యమైన అవకాశాలు ఉన్నాయన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి సింహాచలం మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా మారాలన్నారు. ఉపాధి కోసం ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. నెట్‌వర్కింగ్ నిపుణుడు మిథున్ మాట్లాడుతూ వ్యాపార విస్తరణ, నిర్వహణలో నెట్‌వర్కింగ్ ఎంతో కీలకమన్నారు. గ్రావ టిష్పింగ్ అధినేత జి.సాంబశివరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో సహజ వనరులు అధికంగా ఉంటాయని చెప్పారు. ఎగుమతులు చేసే స్థాయికి యువతరం ఎదగాలన్నారు. టీం ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ డి.మధుసూదనరావు మాట్లాడుతూ ఎదగాలనే ఆకాంక్ష నూతన సంస్థల ఏర్పాటుకు నాందిగా నిలుస్తుందన్నారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డెరైక్టర్ ఇన్‌చార్జి జి.వి.ఆర్.నాయుడు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అడుగంటిన జూ కొలను

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో కొలను ఎండిపోతోంది. వేసవి ఎండలు రాకముందే ఇక్కడ నీరు ఆవిరైపోయింది. దీంతో అడుగు భాగంలోనే కొద్దిగా నీరు కనిపిస్తుంది. ఇందులో నిండుగా నీరు ఉన్నప్పుడు వన్యప్రాణులతో పాటు ఈ కొలను కూడా సందర్శకులను అలరించేది. ఇందులో చేపల కోసం పక్షులు నిత్యం కొలను చుట్టూ చేరి కిలకిలారావాలతో సందడి చేసేవి. చుట్టూ పచ్చదనం కనువిందు చేసేది. జూ లోపల కొండలపై స్వేచ్ఛగా సంచరించే కనుజులు, జింకలు సాయంత్రం వేళల్లో దాహం తీర్చుకుంటూ.. సేద తీరేది ఇక్కడే. ప్రస్తుతం ఈ కొలనులో నీరు అంతకంతకూ అడుగంటిపోతుండటంతో పక్షులకు, జంతువులకు తాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవు. మార్చి రెండో వారానికే ఇలా ఉంటే.. ఎండలు తీవ్రరూపం దాల్చే ఏప్రిల్, మేలో పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. దీంతో ఇప్పటి నుంచే వన్యప్రాణుల సంరక్షణకు జూ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయక తప్పదు.